بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ       نحمدہٗ ونصلی علیٰ رسولہ الکریم       وعلیٰ عبدہ المسیح الموعود

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 28.10.2016 (Telugu)**

**ప్రతి వక్ఫె నౌ బాలిక, బాలుడు తమ ప్రతిజ్ఞను పూర్తి చేసినచో మనము ప్రపంచములో ఒక విప్లవము సృష్టించగలము. తమ మాటలను ఆచరణాత్మకంగా చూపనిదే నోటి మాటలతో ఎంత ప్రయత్నించినను దాని ప్రభావము పడదని నేను తల్లిదండ్రులకు కూడ చెప్పదలచినాను.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 28.10.2016 తేదీన కెనడాలో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

అల్లాహ్ తఆలా కృపానుసారము జమాఅత్‌లో తమ పిల్లలను సమర్పించుటకు శ్రద్ధ పెరుగుచున్నది. తల్లిదండ్రుల ఉత్తరములు నాకు రోజు అందుచున్నవి. కొన్ని రోజులలో తల్లిదండ్రులు తమ పిల్లలను వక్ఫె నౌలో చేర్చాలని మనవి చేసే ఉత్తరముల సంఖ్య 20, 25నకు చేరుతున్నది. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిరాబె రహ్మహుల్లాహు ఈ పిలుపునిచ్చినప్పుడు మొదట ఇది తాత్కాలికమైనదై యుండెను. కాని అనంతరం దానిని శాశ్వతము చేసిరి. జమాఅత్ కూడ, ప్రత్యేకంగా తల్లులు ప్రతి దేశములో ముందుకు వచ్చినారు. నేటికి 12, 13 సంవత్సరముల క్రితం వాఖిఫీనె నౌల సంఖ్య 28000ల వరకుండెను. ఇప్పుడు అల్లాహ్ తఆలా కృపానుసారము ఈ సంఖ్య 61000వకు చేరినది. వీటిలో 36 వేల కంటే ఎక్కువ బాలురు కాగా మిగతా వారు బాలికలు. అనగా సమయము గడుచుచున్న కొద్ది మనము మన పిల్లలను జన్మించక ముందే సమర్పించాలనే ఆలోచన పెరుగుచున్నది. కాని కేవలం పిల్లలను సమర్పించడంతోనే తల్లిదండ్రుల బాధ్యతలు ముగియక వాస్తవానికి గతము కంటే అధికమగును. నిస్సందేహముగా ఒక అహ్మది బాలుని సంస్కరణ బాధ్యత తల్లిదండ్రులపై నే గలదు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రాపంచిక విద్యను కూడ కోరుతారు. సంస్కరణ కూడ కోరుతారు. ధార్మిక బోధన కూడ కోరుతారు. కాని ప్రతి బాలుడు ప్రత్యేకంగా వక్ఫె నౌ బాలుడు వారి వద్ద జమాఅత్ న్యాసమని గుర్తుంచుకోవలెను. అతని సంస్కరణ, అతన్ని జమాఅత్, సమాజము కొరకు ఉత్తమ పౌరునిగా తీర్చిదిద్దుట తల్లిదండ్రుల బాధ్యత. కాని వాఖిఫీనె నౌ పిల్లల సంస్కరణ, వారి ధార్మిక, ప్రాపంచిక బోధన గురించి ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని ఉత్తములుగా సిద్ధము చేసి జమాఅత్‌నకు అందించుట కూడ వారి బాధ్యత అగును. ఎందుకనగా మా వద్ద పుట్టబోవుచున్న బాలుడు లేదా బాలికను అల్లాహ్ తఆలా కొరకు, అల్లాహ్ తఆలా ధర్మము కొరకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుని లక్ష్యమును ఛేధించుటకు అనగా మార్గదర్శమును సంపూర్ణము చేయుటకు, ఇస్లాం బోధనను ప్రపంచములో వ్యాపింపజేయు లక్ష్యము, అల్లాహ్ తఆలా హక్కు చెల్లించుట వైపు ప్రపంచమునకు దృష్టి కలిగించే లక్ష్యము కొరకు జన్మించక ముందే మేము సమర్పించుచున్నామని తల్లిదండ్రులు ప్రతిజ్ఞ చేస్తారు. కనుక ఇదేదో సామాన్య కర్తవ్యము కాదు. వక్ఫె నౌ తల్లిదండ్రులు ప్రత్యేకంగా తల్లి తన పిల్లలను జన్మించకముందే అల్లాహ్ తఆలాతో ఒక ప్రతిజ్ఞ చేయుచు సమర్పింతురు. హజ్రత్ మర్యమ్ వలె మేము అల్లాహ్ తఆలాతో ప్రతిజ్ఞ చేయుచు తమ పిల్లలను వక్ఫె నౌ పథకంలో ప్రవేశపెట్టుచున్నామని ప్రస్థుత ఖలీఫాకు ఇట్లు వ్రాయుదురు. رَبِّ اِنِّیۡ نَذَرۡتُ لَکَ مَا فِیۡ بَطۡنِیۡ مُحَرَّرًا فَتَقَبَّلۡ مِنِّیۡ ۚ اِنَّکَ اَنۡتَ السَّمِیۡعُ الۡعَلِیۡمُ అనగా ఓ! నా పోషకుడా నా గర్భములో యున్నదానిని నేను నీ కొరకు సమర్పించుచున్నాను. బలుడా లేక బాలికా ఎవరున్నారో నాకు తెలియదు. కాని ఎవరున్నా ధార్మిక సేవకులుగా కావాలని నా కోరిక, నా దుఆ. فَتَقَبَّلۡ مِنِّیۡ నా ఈ కోరికను, దుఆను, ఇతన్ని ఆమోదించుము. اِنَّکَ اَنۡتَ السَّمِیۡعُ الۡعَلِیۡمُ నిశ్చయముగా నీవు సర్వ శ్రవణ సమర్థుడవు, సర్వజ్ఞుడవు. తన పిల్లలను వక్ఫె నౌలో సమర్పించే సమయమున ఒక తల్లి ఇలా ఆశించును. ఇందులో తండ్రి కూడ పాల్గొనును.

పాత కాలపు ఒక కథను వినిపించే ఉద్దేశముతో అల్లాహ్ తఆలా ఈ దుఆను పవిత్ర ఖుర్‌ఆన్‌లో భద్రపరచలేదు. అల్లాహ్ తఆలాకు ఈ దుఆ ఎంత నచ్చినదనగా భవిష్యత్తులో రాబోవు తల్లులు కూడ ఈ దుఆ చేసి తమ పిల్లలను

ధర్మము కొరకు అసాధారణ రీతిలో త్యాగము చేసే విధముగా సిద్ధము చేయాలని దీనిని భద్రపరచెను. యదార్థమేమనగా ప్రతి విశ్వాసి ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిత్తునని ప్రతిజ్ఞ చేయును. కాని వక్ఫ్ చేసేవారు ఈ ప్రామాణికముల శిఖర స్థాయికి చేరవలెను. మీరు సమర్పించబడినారు, మీరు కేవలం ధార్మిక సేవ చేయవలెను, ఇదే మీ జీవిత లక్ష్యమని బాల్యము నుండే తల్లిదండ్రులు వారికి తెలుపుచు దుఆ కూడ చేసినచో తాము ధార్మిక సేవ చేయాలనే ఆలోచనతోనే పిల్లలు పెరుగుతారు. మేము వ్యాపారస్తులము కావాలని, మేము ఆటగాళ్లు కావాలని, మేము ఫలానా శాఖలో పని చేయాలనే ఆలోచనతో పెరుగరు. నేను ఏ శాఖలో పని చేయాలో నాకు జమాఅత్ చెప్పవలెను, వర్తమాన ఖలీఫా చెప్పవలెనని వారు ప్రశ్నింతురు. నాకిప్పుడు ప్రపంచముతో ఎలాంటి సంబంధము లేదని అందురు. నేను నిస్వార్థముగా, ఎలాంటి ఆపాచన లేకుండా కేవలం ధార్మిక సేవ కొరకే తనను తాను సమర్పించుచున్నాని అందురు.

నేనింతకు ముందు కూడ అనేక సార్లు వివరంగా తెలిపినాను. మేము తమను తాము సమర్పించినచో ప్రాపంచికముగా ఎలా జీవించగలమనే ఆలోచన వఖ్ఫె నౌ బాలునికి కలుగకూడదు. లేదా మేము తల్లిదండ్రులకు ఆర్థికంగా, ప్రాపంచికపరంగా ఎలా సేవ చేయగలమనే అపోహ కలుగకూడదు. గత కొద్ది రోజుల క్రితం ఇక్కడ వాఖిఫీనె నౌ పిల్లలతో నేను ఒక తరగతిలో పాల్గొన్నాను. మేము జమాఅత్‌నకు అనుక్షణం సమయము సమర్పించి సేవలు చేసినచో మేము తల్లిదండ్రులకు ఆర్థికంగా లేదా బాహ్యము లేదా ఇతర సేవలు ఎలా చేయగలమని ఒక బాలుడు ప్రశ్నించెను. మేము నిన్ను సమర్పించినాము, నీవు జమాఅత్ న్యాసమని తల్లిదండ్రులు బాల్యము నుండే చెప్పలేదని ఈ ప్రశ్న ద్వారా తెలియుచున్నది. ఇతర సోదరీమణులు, సోదరులు మాకు సేవ చేస్తారు. కాని నీవు కేవలం వర్తమాన ఖలీఫాకు తనను సమర్పించుము, వారి ఆదేశముల మేరకు నడుచుకొనుము. హ(జ్రత్ మర్యమ్ దుఆలో **ముహర్రరన్** అను పదము ఉపయోగించబడెను. నేను ఈ పిల్లను ప్రాపంచిక బాధ్యతల నుండి వేరు చేసినానినే దాని అర్థము. ఇతను పూర్తిగా ధర్మ సేవ చేయాలని నా దుఆ. కనుక వీరి తల్లిదండ్రులకు నేను చెప్పదలచినదేమనగా వఖ్ఫె నౌ నామము మాత్రమే సరిపోదు. వాస్తవానికి వక్ఫ్ ఒక ముఖ్యమైన బాధ్యత. ప్రాపంచిక విద్య పొందిన కొందరు బాల బాలికలు చాలా ఉత్సాహము చూపుచు తమ సేవలను ప్రవేశపెట్టుతారు. కాని తరువాత జమాఅత్ అందించుచున్న అలౌన్స్‌తో మా పూట గడవడం లేదని విడిచిపెట్టుతారు. ఒక పెద్ద లక్ష్యమును పొందుటకు ఇబ్బంది పడి త్యాగము చేయవలసి వచ్చును. నా ఫలానా సహ విద్యార్థి నాకు సమానంగా విద్యనభ్యసించి లక్షలు సంపాదించుచున్నాడు, నా నెల జీతం అతని ఒక రోజు ఆదాయమునకు సమానంగా కూడ లేదని ఆలోచించే బదులు అల్లాహ్ తఆలా నాకు అందించిన స్థానము ప్రాపంచిక ధనము కంటే చాలా గొప్పదని భావించవలెను. ప్రాపంచిక ధనము, వనరుల విషయములో తన కంటే తక్కువ కలిగిన వారిని చూడుము, ఆధ్యాత్మికముగా తన కంటే ముందున్న వారిని చూడుమనే ఆంహ(జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశమును గమనించుము. కనుక ప్రాపంచిక పరుగులో ముందుకు వెళ్లే బదులు అధ్యాత్మిక పరుగులో ముందుకు వెళ్లుటకు ప్రయత్నించుము.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. వాఖిఫీనె నౌ ఒక సాధారణ అహ్మదీ కంటే గొప్పగా ఈ ఉన్నత స్థాయిని పొందుటకు ప్రయత్నించవలెను. వాఖిఫీనె నౌ తమ నిరాడంబర ప్రామాణికములను చాలా పెంచుకోవలెను. తమ త్యాగ ప్రామాణికములను చాలా పెంచుకోవలెను. మేము ఆర్థికంగా బలహీనంగా యున్నచో మా సోదరీమణులు, సోదరులు చిన్న చూపు చూచెదరు లేదా తల్లిదండ్రులు ఇతరుల వైపు శ్రద్ధ చూపినట్లు చూపరని భావించకూడదు. వాఖిఫీనె నౌ తమ త్యాగ ప్రామాణికమును పెంచుకొన్నట్లే తమ ప్రార్థన ప్రామాణికమును పెంచుకోవలెను, తమ విశ్వసనీయత ప్రామాణికమును పెంచుకోవలెను, తమ, తమ తల్లిదండ్రుల ప్రతిజ్ఞనను పూర్తి చేయుటకు తమ ప్రతిభను, సామర్థ్యములను శక్తిమేర వినియోగించుటకు ప్రయత్నించవలెను. ధర్మ ఔన్నత్యము కొరకు పని చేయవలెను. అప్పుడు అల్లాహ్ తఆలా అనుగ్రహించును. ఫలితమివ్వనిదే వదిలి పెట్టడు. తమ ప్రతిజ్ఞలను విశ్వసనీయతతో పూర్తి చేయుట గురించి హ(జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లు వ్రాసిరి. ఇందు కొరకే అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో హ(జ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలాంను ప్రశంసించినాడు. وَاِبْرٰهِيْمَ الَّذِيْ وَفّٰٓى అనగా అతను చేసిన ప్రతిజ్ఞనను పూర్తి చేసెను. కనుక ప్రతిజ్ఞలను పూర్తి చేయుట చిన్న విషయము కాదు. జీవిత సమర్పితుని ప్రతిజ్ఞ గురించి హ(జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బాధాతప్త పదములను మనము విన్నాము. ఇదెలాంటి ప్రతిజ్ఞ. ప్రతి వఖ్ఫె నౌ బాలిక, బాలుడు తమ ప్రతిజ్ఞను పూర్తి చేసినచో మనము ప్రపంచములో ఒక విప్లవము

సృష్టించగలము.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ తఆలాతో విశ్వసనీయత, స్వచ్ఛత, వినమ్రతతో వ్యవహరించుట ఒక మృత్యువును ఆశించును. మానవుడు ప్రపంచము, దాని ఆనందములను, ఆడంబరాలను వీడుటకు సిద్ధము కానిదే, ప్రతి అవమానము, ఇబ్బందిని అల్లాహ్ తఆలా కొరకు భరించుటకు సన్నద్ధం కానిదే ఈ లక్షణము ఏర్పడదు. ఒక వృక్షము లేదా రాయిని పూజించడమే విగ్రహారాధన కాదు. అల్లాహ్ తఆలా సామీప్యము నుండి దూరముంచు, అతనికెదురుగా భారమైన ప్రతి వస్తువు విగ్రహమే. ఎన్ని విగ్రహాలను తనలో వుంచుకొనినను నేను విగ్రహారాధకున్నని మనిషికి తెలియనే తెలియదు.

హుజూర్ ఇట్లనిరి. ఇబ్రాహీమ్ అలైహిస్సలాంనకు ఈ బిరుదు ఉచితముగానే లభించినదా ? తన కుమారున్ని త్యాగము చేయుటకు సిద్ధమైనప్పుడు اِبۡرٰهِيۡمَ الَّذِىۡ وَفّٰٓى అని ధ్వని వచ్చినది. అల్లాహ్ తఆలా ప్రేమను ఆకర్షించుటకు ఈ ప్రామాణికము అవసరమగును. అతని శుభములను పొందుటకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దీనిని మన ముందు ప్రవేశపెట్టినారు. దీనిని పొందుతామని మనతో ఆశించినారు. ఈ ప్రామాణికమును ప్రతి వఖ్ఫె నౌ గురుంచుకోవడమే కాక ప్రతి జీవిత సమర్పితుడు త్యాగముల ప్రామాణికములను పొందనిదే మన వఖ్ఫ్ ప్రకటనలు పునాది రహితమని భావించవలెను. కొందరు తల్లులు ఇట్లందురు. మేము కెనడా వలస వచ్చినాము. మా కుమారుడు పాకిస్తాన్‌లో మురబ్బి లేదా జీవిత సమర్పితుడిగా యున్నాడు. అతన్ని కూడ ఇక్కడికి రప్పించగలరు. అతడు మా వద్దకు వచ్చుటకు అతన్ని ఇక్కడే నియమించగలరు. సమర్పించినప్పుడు ఈ కోరికలు, ఆశలు ఎలా ? కోరికలు ముగిసినవి. దుఃఖము, బాధ లేనిదే త్యాగము కాదు. పరిస్థితులు మారినప్పుడు భరించవలెను. అల్లాహ్ తఆలా వీడదు, అనంతముగా కరుణించును వాఖిఫీన్లందరు, వారి తల్లిదండ్రులు కూడ వఖ్ఫ్ వాస్తవమును అర్థము చేసుకొని తమ ప్రతిజ్ఞలను పూర్తి చేయువారగుగాక! తమ విశ్వసనీయత ప్రామాణికములను గొప్ప స్థాయికి చేర్చుదురు గాక!

మీరు చాలా స్పెషల్ బాలురని కొందరు వాఖిఫీనె నౌ బాలల మెదడులో ఆలోచన కల్పింతురు. ఫలితముగా వారు తరువాత తమ ఆలోచనలో స్పెషల్‌గానే మిగిలిపోతారు. ఈ విషయము ఇక్కడ కూడ యున్నట్లు కొన్ని విషయములు నాకు తెలిసినవి. వారు వఖ్ఫ్ వాస్తవమును విస్మరించి వఖ్ఫె నౌ టైటిల్‌ను తమ జీవిత లక్ష్యముగా భావించి మేము స్పెషల్ అని భావింతురు. మేము వఖ్ఫె నౌలో యున్నందున అమ్మాయిలు అయినచో నాసిరాత్, లజ్న, అబ్బాయిలు అయినచో అత్ఫాల్, ఖుద్దామ్‌ల కార్యక్రమాలలో పాల్గొనవలసిన అవసరం లేదని కొందరి మనసులో ఆలోచన రావడం మొదలైనది. మా శాఖ విడదీయబడినదనే భావన ఎవరి హృదయములోనైనా యున్నచో ఇది అపోహ మాత్రమే.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. స్పెషల్ అగుటకు వారు నిరూపించవలెను. ఏమి నిరూపించవలెను ? అల్లాహ్ తఆలాతో సంబంధములో ముందడుగు వేసి స్పెషల్ అనబడవలెను. వారిలో దైవభీతి ఇతరుల కంటే ఎక్కువ యుండవలెను. అప్పుడు స్పెషల్ అనబడుదురు. వారి ప్రార్థన ప్రామాణికము ఇతరుల కంటే గొప్పగా యుండవలెను. అప్పుడే వారు స్పెషల్ అనబడుదురు. వారు ఫర్జ్ నమాజ్‌తో పాటు నవాఫిల్ కూడ సలిపినప్పుడు స్పెషల్ అనబడదురు. వారి సామాన్య ప్రవర్తనల ప్రామాణికము చాలా ఉన్నత స్థాయికి చేరియుండవలెను. స్పెషల్ అగుటకు ఇదొక చిహ్నము. వారి మాటలు, సంభాషణలో ఇతరుల కంటే చాలా వ్యత్యాసము గలదు. ప్రత్యేక శిక్షణ పొంది, ఎట్టి పరిస్థితిలోనైనా ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిచ్చు వ్యక్తి అని తెలిసినప్పుడు స్పెషల్ అనబడును. అమ్మాయిలు అయినచో వారి వస్త్ర ధారణ, ముసుగు సరియైన రీతిలో ఇస్లాం బోధనకు అనుగుణంగా యుండి ఇతరులు వారిని చూచినప్పుడు ఇష్టపడినప్పుడే ఇటువంటి వాతావరణములో యుండినను వీరి వస్త్రధారణ, ముసుగు అసాధారణమని అనిపించినప్పుడు వారు స్పెషల్ అగుదురు. అమ్మాయిలు అయినచో వారి చూపులు క్రిందికి యుండవలెను. అటు ఇటు తప్పుడు విషయముల వైపు చూడకూడదు. అప్పుడు స్పెషల్ అనబడుదురు. వారు ఇంటర్నెట్, ఇతర సాధనముల ద్వారా వృధాలను తిలకించే బదులు ధార్మిక విద్యను పొందుటకు సమయమును గడపవలెను. అప్పుడు స్పెషల్ అనబడుదురు. బాలల ముఖములు వారిని ఇతరుల కంటే వేరుగా చూపినప్పుడే వారు స్పెషల్ అనబడుదురు. ప్రతి రోజు పవిత్ర ఖుర్ఆన్ పఠించవలెను, దాని ఆదేశములను వెతికి వెతికి పాటించవలెను. అప్పుడు వారు స్పెషల్ అనబడుదురు. ఉపశాఖల, జమాఅత్ కార్యక్రమాలలో ఇతరల కంటే

అధికముగా క్రమం తప్పకుండా పాల్గొన్నప్పుడే వారు స్పెషల్ అనబడుదురు. తల్లిదండ్రులతో సత్ప్రవర్తన, వారి కొరకు దుఆలలో తమ సోదరీమణులు, సోదరుల కంటే ముందుంటేనే స్పెషల్ అనబడుదురు. వివాహ సంబంధాల సమయమున బాల, బాలికలు ప్రపంచమును చూచే బదులు ధర్మమును చూచి తమ సంబంధములు కుదుర్చుకొన్నచో స్పెషల్ అనబడుదురు. వారిలో ఇతరుల కంటే ఎక్కువ సహన శక్తి గలదు. జగడము, పీడనము, కలహముల సమయమున వాటి నుండి దూరముండడమే కాక సంధి కుదుర్చుకునేవారైనప్పుడు స్పెషల్ అనబడుదురు. ప్రచార మైదానములో అందరికంటే ముందుకు వచ్చి ఈ బాధ్యతను నిర్వర్తించినప్పుడు స్పెషల్ అనబడుదురు. ఖిలాఫత్ విధేయత, దాని ఆదేశములను పాటించుటలో ముందు వరుసలో యున్నప్పుడు స్పెషల్ అనబడుదురు. ఇతరుల కంటే ఎక్కువ ఓర్పు. త్యాగములు చేసినప్పుడు స్పెషల్ అనబడుదురు. నిరాడంబరత, నిస్వార్థములో ముందుండి గర్వముతో అసహ్యము, దానికి వ్యతిరేకంగా శ్రమించువారైనచో స్పెషల్ అనబడుదురు. మార్గదర్శనము లభించాలని ఎమ్.టి.ఏ.ద్వారా నా ఖుత్బా వినువారు, నా ప్రతి కార్యక్రమమును చూచేవారు చాలా స్పెషల్ అగుదురు. ఈ విషయములన్నిటిని, అల్లాహ్ తఆలాకు ఇష్టమున్న విషయములన్నిటిని చేసేవారైనచో, అల్లాహ్ తఆలాకు ఇష్టము లేని విషయముల నుండి దూరమున్నచో నిశ్చయముగా వారు స్పెషలే కాక చాలా స్పెషల్ వ్యక్తులే. లేనిచో మీలో ఇతరులలో ఎలాంటి తేడా లేదు. దీనిని తల్లిదండ్రులు కూడ గుర్తుంచుకోవలెను. ఈ తరహాలో తమ పిల్లలను తీర్చిదిద్దవలెను. ఈ విషయములన్ని యున్న మిమ్ములను ఇప్పుడు ప్రపంచములో విప్లవమును సృష్టించుటకు అల్లాహ్ తఆలా ఎన్నుకొనెను.

సంస్కరణ గల ఈ కాలములో ఈ విధముగా పిల్లలను స్పెషల్‌గా మార్చుటకు తల్లిదండ్రులు బాధ్యులు. పెద్దగైన తరువాత వాఖిఫీనె నౌ స్వయముగా ఈ ప్రామాణికమును పొందవలెను. తమ మాటలను ఆచరణాత్మకంగా చూపనిదే నోటి మాటలతో ఎంత ప్రయత్నించినను దాని ప్రభావము పడదని నేను తల్లిదండ్రులకు కూడ చెప్పదలచినాను. తల్లిదండ్రులు తమ సమాజులలో ఆదర్శముగా యుండవలెను. పవిత్ర ఖుర్‌ఆన్‌ను చదవడం చదివిడంలో తమ ఆదర్శములను చూపవలెను. గొప్ప ప్రవర్తనలకు ఆదర్శముగా యుండవలెను. ధార్మిక విద్య నేర్చుకొనుటలో స్వయముగా శ్రద్ధ చూపవలెను. అసత్యము నుండి అసహ్యములో గొప్ప ఆదర్శముగా యుండవలెను. ఒక పదవిదారునితో బాధ కలిగినను జమాఅత్ వ్యవస్థ లేదా పదవిదారులకు వ్యతిరేకంగా గృహములో మాట్లాడకూడదు. ఎమ్.టి.ఏ. ద్వారా కనీసం నా ఖుత్బాలను క్రమం తప్పకుండా వినవలెను. ఈ విషయములు కేవలం వాఖిఫీనె నౌ తల్లిదండ్రులకే అనివార్యము కాదు తమ సంతానము జామఅత్ వ్యవస్థతో ముడిపడియుండాలని భావించే ప్రతి అహ్మదీకి అవసరమే. తమ గృహములను అహ్మదీయుల గృహములుగా మార్చుము. ప్రాపంచికుల గృహములుగా మార్చకూడదు. లేనిచో భావి తరాలు ప్రాపంచికములో తలమునకలై అహ్మదియ్యత్ నుండి దూరము పోవడమే కాక అల్లాహ్ తఆలా నుండి కూడ దూరము పోయి తమ ఇహ, పరలోకము రెండింటిని నాశనం చేసుకొందురు. వాఖిఫీనె నౌ పిల్లలందరు అల్లాహ్ తఆలా సామీప్యము పొందడము, నిష్టాపరతను అనుసరించడమే కాక వారి చిరంజీవుల ఆచరణ కూడ వారిని అన్ని రకాల నిందల నుండి రక్షించువారగుదురు గాక! హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పదే పదే మనకు ఆదేశించిన విధముగా ప్రతి అహ్మదీ నిజమైన అహ్మదీ కావలెను. తద్వారా మనము త్వరగా ప్రపంచములో అహ్మదియ్యత్ నిజమైన ఇస్లాం పతాకమును రెపరెపలాడుచు చూడగలము. ఈ ఉపదేశములను పాటించుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక! (ఆమీన్)

★ ★ ★

BOOK POST (PRINTED MATTER)

To,

.....................................................................

.....................................................................

.....................................................................